# లెమోవా | అమెరికా సామ్రాజ్యవాద ఏడవ నౌకాదళానికి భారత్ సేవలు

**అమెరికాతో** భారతదేశం 'లాజిస్టిక్ ఎక్స్ఛేంజి మెమోరాండం ఆఫ్ ఎగ్రిమెంట్' (పరస్పర సైనిక వసతుల సేవల కల్పనా (ఎల్ఇఎమ్ఓఏ–లెమోవా) ప్రతిపాదనలు ముందుకొచ్చి, ఆ పిదప 2016 ఆగస్టులో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. హిందూ మహా సముద్ర ప్రాంతంలో అమెరికా సామ్రాజ్యవాదం సాగించే యుద్ధాలకు భారత సైనిక నౌకాస్థావరాలను ఉపయోగించుకోనుందని, తన ఆధిపత్య వ్యూహంలో భారతదేశాన్ని ఓ జూనియర్ భాగస్వామిగా చేసుకో నుందని 'జనశక్తి' గతంలోనే వ్యాఖ్యానించింది. అమెరికా యుద్ధ విమానాల, యుద్ధనౌకల విశ్రాంతికి, తిరిగి ఇంధనం నింపుకునేందుకు, పునఃసరఫరాలకు, భారత స్థావరాలలోకి యుద్ధ సామాగ్రిని చేర్చేందుకు అమెరికా సైనిక బలగాలను అనుమతించటానికి 'లెమోవా' అవకాశమిస్తోంది.

'లెమోవా' కొనసాగింపులో భాగంగా 2017 ఫిబ్రవరి రెండవ వారంలో అమెరికా రక్షణశాఖకు, 'రిలయన్స్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్'కు నడుమ 'మాస్టర్ షిప్ రిపైర్ ఎగ్రిమెంట్' జరిగింది. దీనిప్రకారం అమెరికా సామ్రాజ్యవాద ఏడవ నావికాదళ యుద్ధ నౌకలకు సేవలందించటం, గుజరాత్‌లోని పిపావావ్ వద్దనున్న నౌకాశ్రయంలో ఇంధనాన్ని తిరిగి నింపు కునేందుకు అవకాశాలు కల్పించటం జరుగుతుంది.

"అమెరికా నావికాదళానికి చెందిన వందకు పైగా నౌకలు పిపావావ్ నౌకాశ్రయంలో సేవలు పొందేందుకు అవకాశముంద"ని రిలయన్స్ అధికార ప్రతినిధి పేర్కొన్నాడు. రానున్న ఐదు సం॥ల కాలంలో ఈ నౌకాశ్రయం పదివేల కోట్ల రూ॥ విలువైన సేవలను అమెరికా నావికా బలగాలకు అందించటానికి సిద్ధంగా వుందని కూడా అతను పేర్కొన్నాడు. ఇది రిలయన్స్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ సంస్థకు భారీస్థాయిలో వచ్చిపడిన ద్రవ్యలాభంగా వుంటుంది. ఎందుచేతనంటే, 2014లో అనిల్ అంబానీ యాజమాన్యంలోకి వచ్చేనాటికి ఆ సంస్థ మొత్తం రెవిన్యూ ఆదాయం 30 మిలియన్ డాలర్ల కంటే తక్కువగానే వుంది. 'రిలయన్స్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ సంస్థ' (ఆర్‌డిఇ)ను ఉన్నతీకరం చేందుకు, అమెరికా నావికా బలగాలచేత 'గుర్తించబడిన కాంట్రాక్టరు' హోదాను పొందేందుకు, గుజరాత్ ప్రభుత్వం 'ఆర్‌డిఇ'కి పదుల కోట్ల రూపాయల సహాయాన్ని అందజేసింది.

భారతదేశం మరియు అమెరికా 2009లో 'ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం'గా ఏర్పడినప్పటి నుండి, భారత బడాబూర్జువావర్గం అమెరికా సామ్రాజ్యవాదం వైపు మరింతగా మొగ్గుతోంది. 2014లో నరేంద్రమోడి సారథ్యంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశానికి అమెరికా వ్యూహాత్మక మిత్రుడని కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించింది. ఆసియా ఖండంలోను, హిందూమహాసముద్రంలోను అమెరికా ఆధిపత్య వ్యూహంలో భారత దేశాన్ని ముందు పెడుతోంది. చైనాను చుట్టుముట్టటానికి ఉద్దేశించిన – 'ఆసియా కీలు'లో భాగంగా అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో త్రైపాక్షిక ఒప్పందాలలోకి భారత్ ప్రవేశించింది.

పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోను, హిందూ మహాసముద్రపు తూర్పుతీరాలవైపుకు అనగా భారత – పాకిస్థాన్‌ల సరిహద్దులదాకా గస్తీ చేపట్టే బాధ్యతతో డిగోగార్షియా దీవులలో అమెరికా ఏడవ నావికా బలగాలు మోహరించివున్నాయి. దీనితో 70 శాతం పైగా ప్రపంచ వాణిజ్యం జరిగే దక్షిణ చైనా సముద్రం, మలక్కా జలసంధిపై అమెరికా సామ్రాజ్యవాదం అదుపు సాధించుతుంది. ఏడవ నావికా బలగాల నౌకలయొక్క మరమ్మత్తులు, నిర్వహణ జపాన్ మరియు సింగపూర్‌లలో జరుగుతుంది.

హిందూ మహాసముద్రంలోని ఛాగోస్ ద్వీప సముదాయంలో ఒకటైన డిగోగార్షియాను 1966లో సైనిక స్థావర అవసరాల కోసం అమెరికాకు బ్రిటన్ 50 సం॥ల కాలానికిగానూ లీజుకిచ్చింది. (1968లో మారిషస్ స్వాతంత్ర్యానికి రెండు సంవత్సరాల ముందుగా) దాదాపు 2000 మంది ఆ ద్వీపవాసులు అక్కడినుండి గెంటివేయబడి మారిషస్, సెషెల్లస్‌లలో తలదాచు కున్నారు. బ్రిటిష్–ఇండియా మహాసముద్ర భూభాగంగా లండన్ దీనిని పరిగణిస్తోంది.

లీజు కాలపరిమితి ఇటీవల ముగిసింది. అయినా 2036 డిసెంబర్ 20 వరకు తిరిగి లీజు కాలపరిమితిని బ్రిటీష్ పాలకులు పొడిగించారు. విస్థాపనకు గురైన వారు తిరిగి తమ ప్రాంతానికి చేరుకుంటామను కుంటుండగా, వారికి మరింత వేదనను, అవమాన భారాన్ని పెంచుతూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించారు. విస్థాపనకు గురైన వారిని తిరిగి వారి స్వస్థలాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రానీయబోమని గత సం॥ నవంబర్‌లో బ్రిటీష్ పాలకులు ప్రకటించారు కూడా.

ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో మారిషస్ ఓటుహక్కు పొందిన తర్వాత ఛాగోస్ ద్వీపసముదాయంపై సార్వభౌమాధికార వివాదాన్ని పరిష్కరించుకునేందుకు, ఈ విస్థాపన సమస్యపై బ్రిటన్‌ను అంతర్జాతీయ న్యాయస్థానం ముందు నిలబెడతామని మారిషస్ ప్రధాని అనెరూడ్ జుగ్‌నౌథ్ హెచ్చరించాడు కూడా.

2017 జనవరి చివరివారంలో హిందూస్థాన్ టైమ్స్ ఈ విధంగా ప్రచురించింది: "బ్రిటన్ మరియు అమెరికా సంయుక్త రాష్ట్రాలు – భారత్‌ను సంప్రదించి, భారత్ తన పరపతితో మారిషస్‌తో చర్చించటంద్వారా, భారీ సైనిక స్థావరం కలిగివున్న డిగోగార్షియా దీవుల వివాదంపై అమెరికాకు సానుకూలంగా మారిషస్ మొగ్గుచూపే ప్రయత్నాలు చేశాయి. అయితే, మారిషస్ సార్వభౌమాధికారం, న్యాయపరమైన వివాదాల చిక్కులలో ఇరుక్కుంది". అమెరికా విదేశాంగ శాఖామంత్రి బోరిస్ జాన్సన్ తన భారత్ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో భేటీ అయ్యాడని, ఈ వివాదంలో భారత ప్రభుత్వ సహకారం కోరాడని లండన్‌లోని వర్గాలు హిందూస్థాన్ టైమ్స్‌కు తెలిపాయి. భారత ప్రభుత్వ దృక్పథం నుండి 'మంచి సూచిక'లుగా పరిగణించేవాటిగా భావిస్తూ బ్రిటన్ మరియు అమెరికాలు "ఒకే తరహా రక్షణ ఆకృతు"లలో భాగంగా భావించే ఈ సహాయం కోరారు. భారత ప్రయోజనాలకోసమే అమెరికా రక్షణ స్థావరం కొనసాగించబడుతుందని మోడీకి తెలియజేశారు.

భారతదేశాన్ని తన ప్రచారకర్తగా నిలిపేందుకు అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న ఒక బాహాటమైన బెదిరింపు ఇది. అమెరికా తన ఏడవ నావికా బలగాలను మోహరించి, ఆనాడు బంగ్లాదేశ్‌లో సైనికజోక్యం చేసుకున్నప్పుడు భారత దేశాన్ని బెదిరించేందుకు పూనుకుంది. కానీ తనను తాను నిభాయించుకుంది. ఎంచేతనంటే, ఆ సమయంలో రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదంతో భారతదేశం ఓ సైనిక ఒడంబడిక చేసుకొని వుంది. భారత బడాబూర్జువా వర్గం తమ దళారీ స్వభానికనుగుణంగా వ్యవహరిస్తోంది. భారతదేశ భద్రత, సార్వభౌమాధికారాలపట్ల వారికి ఇసుమంతైనా గౌరవం వుంటుందని అనుకోగలమా?!

ooooo